నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 11 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET

## సరిపడాలేని టాయిలెట్లు

గద్వాల, ఆగస్టు 10 : గద్వాల నియోజకవర్గంలోని గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. బోధనా సిబ్బంది లేకపోవడంతో కనీస మౌలిక వసతులు కల్పించడంలో సర్కారు విఫలమైంది. గద్వాల మండలంలోని వీరాపురం సమీపంలోని బాలికల ఎస్టీ గురుకులలో 540 మంది విద్యార్థినులు ఉన్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కేవలం 30 టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. గదుల కొరతతో కంబైన్డ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ధరూర్ మండలం గుడ్డందొడ్డి (గర్ల్స్) గురుకులలో 609మంది విద్యార్థినులు ఉన్నారు. నెట్టెంపాడ్ ఉద్యోగుల కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో రెండు గురుకులాలు నిర్వహిస్తున్నారు. టాయిలెట్లు సరిపోక ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. గతంలో ధరూర్ మండలం మార్లబీడు గురుకుల విద్యార్థులు సరిగా భోజనం పెట్టడం లేదని పాదయాత్రగా కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపట్టగా, పోలీసులు నచ్చజెప్పి పంపించారు. గట్టు సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాల లో 640మంది విద్యార్థినులు ఉన్నారు. డైనింగ్ హాల్, తాగునీటి సమస్య ఉన్నది. అలాగే ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో 560 మంది విద్యార్థులున్నారు.



అపరిశుభ్రత, పాకర పట్టిన గోడల మధ్య ఉన్న తాగునీటి నల్లా వద్ద ప్లేట్లను కడుగుతున్న విద్యార్థులు, తోటి వారికి వడ్డిస్తున్న విద్యార్థి

## సమయం మార్పుతో సమస్య

గురుకుల విద్యాలయాల్లో గతంలో ఉదయం 9 గంటలకు తరగతులు ప్రారంభమవుతుండగా.. ఉదయం 5 గంటలకు లేచిన విద్యార్థులు 6 గంటల వరకు కాలకృత్యాలు తీర్చుకొని 8 గంటల వరకు రెడీ అయి.. అల్పాహారం చేసి 9 గంటలకు వెళ్లేవారు. ప్రస్తుతం ఉదయం 8 గంటలకే తరగతులు ప్రారంభిస్తుండడంతో ఉదయం 7 గంటల వరకే అన్ని పనులు చేసుకోవాల్సి వస్తుంది. అనంతరం అల్పాహారం పూర్తి చేసుకుని పాఠశాలకు వస్తున్నారు. కేవలం రెండు గంటల్లోనే పనులన్నీ పూర్తి చేసుకోవడం విద్యార్థులకు సాధ్యం కాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి 7:30 గంటలకు స్టడీ అవర్ పూర్తి చేసుకుని, 9 గంటల వరకు భోజనం చేసి నిద్రపోయేవారు. గంట సమయం ముందుకు రావడంతో సాయంత్రం 7 గంటల్లోపే భోజనం చేయాల్సి వస్తుంది. అనంతరం స్టడీ అవర్ ఉంటుంది. దీంతో రాత్రి పడుకునే ముందు మళ్లీ ఆకలి వేస్తుందని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.



విశ్రాంతి గదులు లేకపోవడంతో గిరిజన గురుకుల పాఠశాల తరగతి గదిలోనే నిద్రపోతున్న విద్యార్థినులు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురుకులాల వివరాలు..**

- సాంఘిక సంక్షేమ గురుకులాలు : 32
- గిరిజన సంక్షేమ గురుకులాలు: 18
- మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాలు : 32
- మైనార్టీ సంక్షేమ గురుకులాలు : 25
- తెలంగాణ రాష్ట్ర గురుకులం : 1
- కేజీబీవీలు : 72
- 65 వేలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.



మన్యంకొండ గురుకులంలో మంచాల వైపు వస్తున్న బాత్రూం నీళ్లు

# గాడి తప్పిన గురుకులం!

- సమస్యలకు కేరాఫ్‌గా పాఠశాలలు
- వసతులు, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- విద్యార్థుల చదువు, పడక ఒకేచోట..
- పలు చోట్ల సక్రమంగా అమలుకాని మెనూ
- నాణ్యతలేని భోజనంతో అనారోగ్యంపాలు
- పురుగుల అన్నం తినలేక పస్తులతో బాధలు
- వేధిస్తున్న ఉద్యోగుల కొరత, వసతులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

**కేసీఆర్ ప్రభుత్వంలో విద్యాపరంగా వెలుగు వెలిగిన గురుకులాలు నేడు మసకబారుతున్నాయి. సన్నబియ్యంతో భోజనం చేసిన విద్యార్థులు నేడు పురుగుల అన్నంతో పస్తులుంటున్నారు. నాణ్యతలేని భోజనం.. కరువైన వసతులతో సరస్వతీ నిలయాలు సమస్యలకు కేరాఫ్‌గా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలలకు రూ.కోట్లు విడుదల చేస్తున్నా.. బోధన ఫర్వాలేదనిపిస్తున్నా.. సమస్యలు వెక్కిరిస్తున్నాయి. అరకొర వసతుల మధ్య చదువు సాగుతున్నది. తరగతి గదులే వసతి కేంద్రాలుగా మారాయి. పారిశుధ్య సమస్యలు, నాణ్యత లోపించిన భోజనంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. పురుగుల అన్నం తినలేక కడుపు మాడ్చుకుంటున్నారు. ఇటీవల వరుసగా ఉమ్మడి జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బాల్లోని పలువురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. శుభ్రమైన మరుగుదొడ్లు, శుద్ధమైన తాగునీరు, మెనూ ప్రకారం భోజనం అందించడంలో అధికారులు విఫలమవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.**

## విద్యార్థులే వర్కర్లు

- సమస్యలకు నిలయంగా గురుకులాలు
- వేధిస్తున్న ఉద్యోగుల కొరత
- పూర్తికాని అడ్మిషన్లు

అలంపూర్/ఇటిక్యాల, ఆగస్టు 10 : మెరుగైన విద్యను అందించేందుకు ప్రవేశపెట్టిన గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అసంపూర్తి ఉద్యోగుల బదిలీలు, సిబ్బంది కొరతతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఆర్‌ఎస్ సర్కారులో సుమారు రూ.14కోట్లతో ఇటిక్యాలలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను నిర్మించారు. మెరుగైన విద్యాబోధన, నాణ్యమైన భోజనంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్‌కు దీటుగా గురుకుల నిర్వహణ కొనసాగింది. కాంగ్రెస్ సర్కారొచ్చాక పాఠశాలలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. శనివారం పాఠశాలను విజిట్ చేయగా, భోజనశాలలో సమస్యలను కెమెరాల్లో బంధించే ప్రయత్నం చేస్తుండగా అనుమతి తీసుకుని రావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేశ్ పాత్రికేయులను ప్రశ్నించడం కొసమెరుపు. విద్యార్థులు వడ్డించుకొని తినడం కనిపించింది. అంతేకాకుండా పాఠశాలలో ఇతర పనులు కూడా చేయిస్తున్నట్లు తెలుస్తున్నది. 5 నుంచి ఇంటర్ వరకు కొనసాగుతున్న పాఠశాలలో 558 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 36 మంది సిబ్బందికి గానూ 25మంది టీచింగ్, 11 మంది నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. 14 మంది రెగ్యులర్ ఉద్యోగులకు గానూ బదిలీలతో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తోనే కాలం వెల్లదీస్తున్నారు. ఉడికీ ఉడకని అన్నం వడ్డిస్తుండడంతో విద్యార్థులు తినలేక కడుపుమాడ్చుకుంటున్నారు. బాయిలర్ సిస్టమ్‌తో వంటలు చేసే యంత్రం మరమ్మతుకు నోచుకోక వృథాగా ఉన్నది. గురుకుల ప్రహరీ ఎత్తు పెంచాలి.



ఇటిక్యాలలో నిరుపయోగంగా ఉన్న బాయిలర్ స్టీం సెట్



కల్వకుర్తి వెనుకబడిన తరగతుల గురుకుల వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

## అన్నంలో.. పురుగులొస్తున్నాయ్!

- కల్వకుర్తి గురుకుల విద్యార్థుల ఆవేదన

కల్వకుర్తి, ఆగస్టు 10 : రెండేండ్ల కిందట కేసీఆర్ ప్రభుత్వం కల్వకుర్తికి వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. అప్పటికప్పుడు అద్దెకు నిబంధనల ప్రకారం పట్టణంలో భవనం లభించని పరిస్థితుల్లో నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చొరవతో మినీ స్టేడియానికి సంబంధించిన భవనంలో పాఠశాలను ప్రారంభించారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.30 లక్షలు వెచ్చించారు. నాడు 5, 6, 7 తరగతులతో ప్రారంభమైన బాలుర పాఠశాల 2024–25 విద్యా సంవత్సరానికి 9వ తరగతికి అప్‌గ్రేడ్ అయ్యింది. ప్రతి తరగతికి రెండు విభాగాలుగా 80 మంది చొప్పున మొత్తం 400 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే, గదులు ఐదారుకు మించవు. 10 సెక్షన్లకు 10 గదులన్నా కావాలి. దీంతో వరండా, చెట్ల కిందే తరగతి గదులు నిర్వహిస్తున్నారు. భోజనాలు చేయడంతోపాటు ఆట పాట అన్నీ ఇక్కడే..

***భోజనం రెండు విడుతలుగా..***

విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో ఒకేసారి అందరూ కూర్చొని తినే వెసులుబాటు లేదు. సగం మందికి ఒక సారి మిగతా వారికి మరో సారి వడ్డిస్తున్నారు. దీంతో పలువురు కడుపు మాడ్చుకోవాల్సి వస్తున్నది. అప్పుడప్పుడు మిషన్ భగీరథ నీళ్లు ఎగనామం పెడుతుండడంతో ట్యాంకర్ల ద్వారా వచ్చే నీరే గతి. రెండు నెలలుగా దొడ్డు బియ్యమే వండుతున్నారు. రెండ్రోజుల కిందట సన్న బియ్యం వచ్చినా నాణ్యత కొరవడిందని విద్యార్థులే చెబుతున్నారు. అన్నం మెత్తగా.. ఉండలుగా ఉంటుందని, తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందట పప్పులో జెర్రి వచ్చిందని ఒకరు.. అన్నంలో పురుగు వచ్చిందని మరొకరు చెప్పుకొచ్చారు. ప్రిన్సిపాల్‌ను అడిగితే వంట విషయంలో జాగ్రత్తగా ఉంటున్నాం. ప్రతి వారం వంట మనుషులు, స్టాఫ్‌తో మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని, అలాంటిదేమీలేదన్నారు. వంట గది ఇరుకుగా ఉందన్నారు. విద్యార్థులకు గదులు చాలడం లేదని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు.



దొడ్డు బియ్యం ఆనవాళ్లు



వంట గది

## కొరవడిన రుచి, శుచి

- విద్యార్థులకు రోగాలొస్తున్నా.. పట్టించుకోని వైనం



గిరిజన పాఠశాలలో ఒకే గదిలో సామగ్రి మధ్య విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 10 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వెనుకబడిన వర్గాలకు చెందిన లక్షలాది మంది పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో గురుకులాలను ప్రారంభించింది. నాడు వీటి నిర్వహణ చాలా బాగుండగా.. కాంగ్రెస్ హయాంలో సమస్యలకు కేరాఫ్‌గా మారాయి. పర్యవేక్షణ లోపం, పట్టింపులేని తనం, నిధుల లేమితో సమస్యలు తిష్ట వేశాయి. ఇటీవల గురుకులాలు, కేజీబీవీలు, వసతి గృహాల్లో జరుగుతున్న సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

***పారిశుధ్యం అస్తవ్యస్తం***

పలు గురుకులాల్లో పారిశుధ్యం కొరవడింది. నిర్వహణను పట్టించుకోకపోవడం, విద్యాలయాల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, పొదలను తొలగించకపోవడంతో పరిసరాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. దీంతో క్రిమికీటకాలు, విష సర్పాలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒకే గదిలో తరగతులు.. అక్కడే బసతో ఇబ్బందులు పడుతున్నారు. తలుపుల్లేని కిటికీలు, నేలపై నిద్ర, ఇరుకు గదులతో కూడిన అద్దె భవనాల్లో పాఠశాలలు, కళాశాలలు కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. నిర్వహణను పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గురుకుల విద్యాలయాలకు సరఫరా చేసే సరుకులు, నిత్యావసరాలు, భోజన వంట సామగ్రి నాణ్యతలేనివి టెండర్‌దారులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే వారికి ప్రాథమిక చికిత్స అందించేందుకు గురుకుల విద్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు అందుబాటులో ఉండాల్సి ఉండగా.. గదులు సరిపోకపోవడంతో వాటిని ఏర్పాటు చేయడం లేదు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పంపిస్తున్నారు.

***టాయిలెట్లు అరకొర***

ప్రతి నెలా లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నా.. సరిపడా టాయిలెట్లు, మరుగుదొడ్లు లేకపోవడంతో బాలబాలికలు, విద్యార్థినీ, విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో ఉగ్గబట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్ సమీపంలో ఉన్న బీసీ గురుకుల విద్యాలయంలో మొత్తం 680 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 35 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. వాటిలోనూ కొన్ని నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో కంపు కొడుతుండటంతో విద్యార్థులు వాటిని ఉపయోగించుకునేందుకు విముకత చూపుతున్నారు. ఇది ఈ ఒక్క గురుకులం పరిస్థితి మాత్రమే కాదు.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 50 శాతానికిపైగా ఇదే పరిస్థితులు ఉన్నాయి.

***నిత్యం భయం భయంగా..***

జడ్చర్ల కోడ్గల్ గిరిజన గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడా భోజనశాల లేదు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతూ భోజనం చేస్తుంటారు. విద్యాలయానికి చుట్టూ ప్రహరీ లేక నిత్యం భయంభయంగా విద్యార్థులు నిద్రిస్తున్నారు. గదులు సరిపడా లేవు. రాత్రి వేళల్లో తరగతి గదుల్లోనే బస తప్పడం లేదు.



మన్యంకొండ బీసీ గురుకులంలో బాత్రూం దుస్థితి



బాలుర గురుకుల కళాశాలలో అన్నం వడ్డిస్తున్న విద్యార్థులు



రుచిగా లేకపోవడంతో విద్యార్థులు పారబోసిన అన్నం



ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లాకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## రుణమాఫీ చేయించండి సారూ..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి విన్నవించిన రైతులు
- కర్నూల్ బ్యాంకులో రుణాలు తీసుకున్నామని వెల్లడి

అలంపూర్, ఆగస్టు 10 : ఏపీ రాష్ట్రంలోని బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతులకూ రుణమాఫీ వర్తింపచేసేలా చూడాలని ఉమ్మడి రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అలంపూర్ నియోజకవర్గ రైతులు శనివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలు పట్టణంలోని ఐసీఐసీఐ, ఆక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, సెంట్రల్ బ్యాంకుల్లో అలంపూరు నియోజకవర్గంలోని పలు మండలాల రైతులం వ్యవసాయ రుణాలు తీసుకున్నామని, తమకు కూడా రుణమాఫీ వర్తించేలా చూడాలని విన్నవించారు. సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

## ప్రేమ పేరుతో వంచన

- పెండ్లి చేసుకోమంటే చెప్పుతో కొట్టాడు..
- నవాబ్‌పేట పోలీసులకు యువతి ఫిర్యాదు

నవాబ్‌పేట, ఆగస్టు 10 : 'ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని.. మాయమాటలతో లోబర్చుకొన్నాడు.. మోజు తీరాక చెప్పుతో కొట్టి గెంటేశాడు'.. అని ఓ గిరిజన యువతి తన గోడును పోలీసుల ఎదుట వెల్లబోసుకున్న సంఘటన నవాబ్‌పేటలో చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం మేరకు.. ఏపీలోని అనంతపూర్ జిల్లా బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లివంక తండాకు చెందిన శ్రీనునాయక్ ఉద్యోగరీత్యా నవాబ్‌పేటలో కొంతకాలం నుంచి నివాసముంటున్నాడు. శ్రీనునాయక్ కుమార్తె యామినిసింధు(22)కు నవాబ్‌పేట మండల కేంద్రానికి చెందిన షేక్ ముస్తఫా(22)తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారినట్లు ఎస్సై తెలిపారు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ముస్తఫా నమ్మించి లోబర్చుకున్నాడు. యామినిసింధుకు గర్భం రావడంతో 2023 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లోని ఓ (సిగ్మ) దవాఖానలో అబార్షన్ చేయించినట్లు వివరించారు. కొంతకాలం అమ్మాయిని నమ్మించి వారి ఇంట్లోనే పెట్టుకున్నాడు. పెళ్లి గురించి అడిగితే నిరాకరించడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా ముస్తఫా, వారి కుటుంబ సభ్యులు ఖైసర్‌పాషా, సాజిదాబేగం, మహబూబ్, బురాన్, ఇమ్రాన్‌తోపాటు మరికొందరు చెప్పుతో కొట్టి ఇంటి నుంచి గెంటేశారు. ఎనిమిది నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని యామినిసింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## సర్కారు కొలువు పేరిట మోసం!

- రూ.3 లక్షలు ఇచ్చానని పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

గద్వాల అర్బన్, ఆగస్టు 10 : గద్వాల గడ్డ.. మోసాలకు అడ్డాగా మారింది. ఇసుక, మట్టి, పీడీఎస్ బియ్యం, విత్తనాలు ఇలా జిల్లాలో ఏదో విధంగా మోసాలతో మోసపోయిన బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తూనే ఉన్నారు. తాజాగా ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ పెట్టిన సంఘటన చోటు చేసుకున్నది. వివరాలిలా.. 'సర్కారు కొలువు కావాలంటే పెట్టిస్తా.. ఇందు కోసం డబ్బులు ఖర్చు చేయాలి.. నీకు ఉద్యోగం గ్యారెంటీ'.. అంటూ గద్వాలకు చెందిన ఓ వ్యక్తి తనకు ప్రభుత్వ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని ప్రచారం చేసుకున్నాడు. అమాయకులను టార్గెట్ చేసి వారికి కల్లబొల్లి మాటలు చెప్పి ఉద్యోగం ఇప్పిస్తానని నిలువునా మోసం చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అతడి మాటలు నమ్మి ఏడాది కిందట రూ.3 లక్షలు అప్పగించాడు. తర్వాత జాబ్ ఏమైందని అడుగుతుంటే ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తూ మొఖం చాటేశాడు.

దీంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. అతడి నుంచి వివరాలు తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఉద్యోగాల పేరిట చాలా మంది మోసపోయి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ విషయంపై టౌన్ ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారని ఫిర్యాదు వచ్చిందని, పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు వివరించారు. వివరాలు రెండు, మూడ్రోజుల్లో వెల్లడించనున్నట్లు తెలిపారు.

## మెరుగైన వైద్యసేవలందించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, ఆగస్టు 10 : చిన్నచిన్న కారణాలతో కాన్పు కోసం వచ్చే గర్భిణులను ప్రైవేట్ దవాఖానలకు పంపొద్దని, మెరుగైన వైద్యం అందించి తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని కాపాడాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డాక్టర్లకు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కాన్పులు చేసి సామాన్యులకు ఆర్థికభారం తగ్గించాలని డాక్టర్ క్లైవిన్‌మార్క్‌కు చెప్పారు. బుద్దారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్వీ నాయకుడు శ్రావణ్‌కుమార్ దంపతులకు దవాఖానలో మగబిడ్డ జన్మించగా, వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపి, బిడ్డను ఆశీర్వదించారు. మాజీ మంత్రి వెంట బీఆర్‌ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ అశోక్, మండలాధ్యక్షుడు బాలరాజు, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండీ మతీన్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, గ్రామ అధ్యక్షుడు రాజేశ్ తదితరులు ఉన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## తండ్రిని చంపిన తనయుడు



సుల్తాన్ (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఆగస్టు 10 : జల్సాలకు అలవాటు పడి కన్న తండ్రినే కడతేర్చాడు ఓ యువకుడు. ఇందుకు సంబంధించి ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గట్టునెల్లికుదురుకు చెందిన సుల్తాన్ (52) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి కుమారుడు మల్లేశ్ జల్సాలకు అలవాటుపడ్డాడు. ఖాళీగా ఉండే బదులు ఏదైనా పనిచేసుకోమని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. ఇదే క్రమంలో శుక్రవారం సైతం ఇదే విషయమై తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. తండ్రి మందలించడంతో మనసులో పెట్టుకొని శుక్రవారం రాత్రి మల్లేశ్ గొడ్డలితో సుల్తాన్‌ను కిరాతకంగా నరికి చంపాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.